

పేదల కోసమే..

పేదల కోసమే కల్యాణ మండపాలు నిర్మిస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



ఉత్తమ ఉపాధ్యాయులు..

జిల్లాకు చెందిన ఇద్దరు టీచర్లు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. 5న అవార్డు అందుకోనున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.3 /24.2

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

సాక్షి, కామారెడ్డి: ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడుతున్న ఆవర్తనం ప్రభావంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఈ విషయాన్ని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవర్తన ప్రభావంతో ఆదివారంనుంచి మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. రైతులు వర్షపు నీటిని లైనింగ్ ఉన్న నీటి కుంటలు, ఇంకుడు గుంతల్లోకి పంపించి, పొడి వాతావరణం ఏర్పడిన సమయంలో వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలు ఆగేవరకు ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయవద్దని, పశువులను చెట్ల కింద కట్టి ఉంచరాదని, బయటికు తీసుకెళ్లకుండా పాకలలోనే ఉంచి మేతను అందించాలని సూచించారు.

చెక్‌పోస్టు ఏర్పాటు



మద్నూర్: రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో మండలంలోని సలాబత్‌పూర్ వద్ద గల 161 నంబర్ జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం చెక్‌పోస్టును ప్రారంభించామని అధికారులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణ ప్రాంతంలోకి మద్యం, డబ్బులు అక్రమంగా రాకుండా చూసేందుకు ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్, రవాణా శాఖల అధికారులు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు ఇది కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మెట్లబావి పనులు వేగవంతం చేయాలి'



లింగంపేట: మండల కేంద్రంలోని మెట్లబావి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇంజినీర్లకు సూచించారు. శనివారం ఆయన మెట్లబావిని సందర్శించారు. పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లు, అధికారులతో మాట్లాడారు. నాలుగు నెలలుగా పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. నిధుల కొరత లేనప్పుడు పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని ప్రశ్నించారు. మెట్లబావి పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తిచేసి పర్యాటకుల సందర్శన కోసం సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సూపర్‌వైజర్ మల్లేశం, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవో ప్రభాకరచారి, యువయూత్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులున్నారు.

'అధికారంలోకి వస్తే ముదిరాజ్ కార్పొరేషన్'



దోమకొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని అంచనూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ జోగిని గంగయ్యతో పాటు 80 మంది ముదిరాజ్‌లు కామారెడ్డిలో షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీఆర్‌ఎస్ కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందన్నారు. చట్టసభల్లో వారికి అవకాశం కల్పించడం లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, సంఘం ప్రతినిధులు సత్యం, నరేష్, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు రామస్వామి గౌడ్, లచ్చయ్య, సుమన్, సీతారం మధు, గోపాల్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పెళ్లి పిలుపు.. మేలుకొలుపు

పెళ్లంటే నూరేళ్ల పంట.. అందుకే వివాహ వేడుక ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటారు. పెళ్లి విషయంలో వధూవరులెన్నో కలలు కంటారు. నలుగురు మెచ్చేలా గొప్పగా తమ పిల్లల పెళ్లి చేయాలని తల్లిదండ్రులూ కోరుకుంటారు. కొందరు పెళ్లి పత్రిక దగ్గరే తమ ప్రత్యేకత చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. సామాజిక, ఆధ్యాత్మిక కోణాలలో ఆలోచించి పత్రికలు విభిన్నంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఆహ్వాన పత్రికా ఉపయోగపడేలా విభిన్నంగా తయారు చేయిస్తున్నారు. ఓ తండ్రి తులసి విత్తనాలతో తన కూతురు పెళ్లి పత్రికను తయారు చేయించగా.. మరో తండ్రి భగవద్గీతలో శుభలేఖను ముద్రించి పంచారు. మరొకరు సందేశాత్మకంగా రూపొందించి పంపిణీ చేశారు. ఇలా కొందరు పెళ్లి పత్రికతోనూ సమాజానికి మేలు చేస్తున్నారు. కొత్త తరహా శుభలేఖలపై సండే స్పెషల్

ఆహ్వానం.. ప్రయోజనకరం

- వెరైటీగా వెడ్డింగ్ కార్డ్స్ తయారీ
- తులసి విత్తనాలతో పత్రికల ముద్రణ
- భగవద్గీతలో లగ్నపత్రికలు
- ఆధ్యాత్మిక, సామాజిక అంశాలతోనూ శుభలేఖలు



సాక్షి, కామారెడ్డి: సమాజంలో మార్పు వస్తోంది. అన్నింటిలోనూ కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. పెళ్లి పత్రికల విషయంలోనూ ఇదే ఆలోచన చేస్తున్నారు. అందరికన్నా భిన్నంగా ఉండాలన్న తపనతో సృజనాత్మకంగా శుభలేఖలు తయారు చేయిస్తున్నారు. ఇందులోనూ పలువురు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తున్నారు. ఆహ్వాన పత్రికలూ వృథా కాకుండా ఉండేలా పర్యావరణహిత శుభలేఖలను పంచుతూ పెళ్లి పిలుపులతోనూ సమాజాన్ని మేలుకొలుపుతున్నారు.


కామారెడ్డికి చెందిన బంగారం వ్యాపారి యెనిశెట్టి శ్రీనివాస్ కుమారుడు శివతేజ వివాహం ఈనెల 9న జరగనుంది. తన కుమారుడి శుభలేఖ ప్రతి ఇంట్లో పది కాలాల పాటు ఉండేందు కు ఏం చేయాలని తన బంధుమిత్రులతో చర్చించారు. హైదరాబాద్‌లో నివసించే బంధువులకు స్టేషనరీ షాప్ ఉంది. వారి సూచనతో భగవద్గీత, గీతా మాధుర్యం, విష్ణు సహస్ర నామ సహిత భగవద్గీత గ్రంథాలలో లగ్న పత్రికను ముద్రించి బంధుమిత్రులకు పంచారు.


అలాగే కామారెడ్డికి చెందిన నాగెల్లి శ్రీనివాస్ తన కూతురు వివాహం సందర్భంగా సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ ఆహ్వాన పత్రికపై స్లోగన్స్ ముద్రించారు. ఇలా విభిన్నంగా ఆలోచిస్తూ లగ్న పత్రిక గుర్తుండిపోయేలా చూసుకుంటున్నారు.

■ నిజామాబాద్ నగరానికి చెందిన మంచాల జ్ఞానేందర్ గుప్తా అనే వ్యాపారవేత్త సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. తన కూతురు శరణ్య వివాహం కోసం విభిన్నంగా ఆలోచించారు. అహ్మదాబాద్‌కు వెళ్లి తులసి విత్తనాలతో పత్రికలను తయారు చేయించారు. ఈ పెళ్లి పత్రికను పూలమొక్కల కుండిలో వేసి నీళ్లు పోస్తే నాలుగు రోజుల్లో కరిగిపోయి విత్తనాలు వస్తాయని చెప్పడంతో బంధువులు, స్నేహితులందరూ అలాగే చేశారు. చెత్తబుట్టలో చేరాల్సిన పత్రిక.. తులసి మొక్కగా మారిందని జ్ఞానేందర్ గుప్తా మురిసిపోతున్నారు.

■ ప్రస్తుతం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న మంద మకరందు వివాహం గతేడా ది ఫిబ్రవరి 11న జరిగింది. ఆయన సైతం ప్రకృతి హితంగా ఉండేలా తన లగ్న పత్రికను సీడ్ పేపర్‌పై రూపొందించారు. తిరిగి వినియోగించడానికి యోగ్యమైన పోచంపల్లి ఇక్కత్‌తో తయారు చేసిన మాస్క్‌లను పెళ్లిపత్రికతోపాటు అందించారు. ఆ పత్రికను స్వదస్తూరితో రూపొందించడం గమనార్హం.

సండే స్పెషల్





శ్రీమద్భగవద్గీతతో యెనిశెట్టి శ్రీనివాస్ రూపొందించిన పెళ్లి పత్రిక



తులసి విత్తనాలతో జ్ఞానేందర్ రూపొందించిన పత్రిక





నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరందు శుభలేఖ, ఆర్టీసీ ఎండీకి అందిస్తున్న మకరందు(ఫైల్)

పది కాలాలు గుర్తుండేలా...



నా కుమారుడి పెళ్లి ఈనెల 9న జరగనుంది. పెళ్లి పత్రిక అందరికీ ఉపయోగపడేలా ఉండాలని ఆలోచించాను. బంధువులతో మాట్లాడితే భగవద్గీతకు సంబంధించిన వివిధ పుస్తకాలలో ముద్రించి ఇస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. ఆ ఆలోచన నచ్చింది. వీటిని చూసినవారు అందరూ అభినందిస్తున్నారు. పుస్తకం ఉన్నన్ని రోజులు మా కుమారుడి పెళ్లి గుర్తుంటుంది. – యెనిశెట్టి శ్రీనివాస్, కామారెడ్డి

ప్రకృతిహితంగా ఉండాలని..



నా కూతురు శరణ్య వివాహం ఫిబ్రవరి 24న జరిగింది. పెళ్లి పత్రికతో పర్యావరణానికి హాని కలగకుండా ఏం చేయాలా అని ఆలోచించాను. తులసి విత్తనాలతో పత్రిక తయారు చేయించాలని నిర్ణయించుకున్నా. మూడు వేల పత్రికలను బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశాం. వాటిని కుండీలలో ఉంచి తులసి మొక్కలు పెంచారు. ఆనందం అనిపించింది.

– మంచాల జ్ఞానేందర్, నిజామాబాద్

చాలా రకాలుగా ప్రింట్ చేయిస్తున్నారు



మా దగ్గరికి పత్రికల ముద్రణ కోసం వచ్చే వాళ్లు రకరకాలుగా చెబుతుంటారు. కొందరు పత్రికలో సామాజిక చైతన్యం కలిగించే అంశాలు ముద్రిస్తుంటారు. మరి కొందరు ఆధ్యాత్మిక విషయాలు ఉండాలంటారు. ఇంకొందరు వెరైటీగా ఉండాలంటారు. అందరిలోనూ ఆలోచన ధోరణి మారింది. పత్రిక కూడా ఏదో ఒకదానికి ఉపయోగపడాలని అనుకుంటున్నారు.

– శ్రీధర్, కల్కి స్క్రీన్ ప్రింటర్స్, కామారెడ్డి

టెట్‌కు ఏర్పాట్లు చేయండి

- పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు ఫ్లెక్సీలు పెట్టండి
- అధికారులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: టెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. టెట్ ఏర్పాట్లపై శనివారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈనెల 15 న ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో టెట్ ఉంటుందన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే మొదటి సెషన్‌లో 5,535 అభ్యర్థులు, 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రెండో సెషన్‌లో 4,205 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారన్నారు. టెట్ కోసం జిల్లా కేంద్రంలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, హాల్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లు, నాలుగు రూట్లలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించామన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభ్యర్థులు సులువుగా పరీక్ష కేంద్రాల వివరాలు తెలుసుకునేలా బస్టాండ్ ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రాంతాల నుంచి అభ్యర్థులు పరీక్ష సమయానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో రాజు, డీఎస్పీ మదన్‌లాల్, పరీక్షల సహాయ కమిషనర్ లింగం, కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, జిల్లా ఖజానా అధికారి సాయిబాబు, మున్సిపల్ కమిషనర్ వాసు దేవరెడ్డి, విద్యుత్ శాఖ డీఈఈ రంగయ్య, కలెక్టరేట్ ఏవో సయీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం

కామారెడ్డి క్రైం: ఓటరు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాల తయారీపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ గతనెల 26, 27 తేదీలలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన 3,358 దరఖాస్తులను నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తున్నామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మనుచౌదరి, చంద్రమోహన్, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, కార్మిక శాఖాధికారి సురేందర్, తహసీల్దార్లు సురేష్, లత, ఎన్నికల పర్యవేక్షకుడు అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు సాయిలు, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కేటగిరీలవారీగా పాయింట్ల కేటాయింపు
- పాయింట్లు లేక నిరాశ చెందుతున్న యూనియన్ లీడర్లు
- అవకతవకలకు తావులేకుండా చూడాలంటున్న సంఘాల నేతలు

కామారెడ్డి టౌన్: ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు మోక్షం లభించింది. నెల రోజుల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. జిల్లాలో 4,938 ఉపాధ్యాయ పోస్టులుండగా.. 4,078 మంది మాత్రమే టీచర్లున్నారు. పీహెచ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందేవారు 40 మందికి పైగా ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులు పొందేవారు 238 మంది ఉన్నారు. స్పౌజ్ కేటగిరి బదిలీలతో 35 మందికి న్యాయం జరగనుంది.

జిల్లాలోని హెచ్‌ఎంలు, ఎస్‌ఏలు, ఎస్జీటీలు బదిలీలు, ప్రమోషన్లకోసం దరఖాస్తు చేసుకునేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఆదివారం నుంచి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. దరఖాస్తు కాపీలను 6, 7 తేదీలలో డీఈవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. 8, 9 తేదీల్లో దరఖాస్తు చేసిన వారి జాబితా ప్రదర్శన, 10, 11 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 12, 13 తేదీల్లో సీనియారిటీ జాబితా ప్రదర్శన, 14న ఎడిట్ ఆప్షన్ ఉంటాయి. 16న హెచ్‌ఎంల పోస్టుల ఖాళీల వెల్లడి, 17 నుంచి 19వ తేదీవరకు ఎస్‌ఏ నుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతులు, 20, 21 తేదీల్లో ఖాళీ అయిన ఎస్‌ఏల పోస్టుల వెల్లడి, ఎస్‌ఏల వెబ్ ఆప్షన్, 22న ఎడిట్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. 23, 24 తేదీల్లో ఎస్‌ఏల బదిలీ, అదే రోజు ఎస్‌ఏల ఖాళీల వెల్లడి ఉంటాయి. 26 నుంచి 28 వరకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లగా పదోన్నతులు, 29 నుంచి 31 వరకు ఎస్జీటీల ఖాళీల వెల్లడి, అక్టోబర్ 2 ఎస్జీటీల ఎడిట్ ఆప్షన్, 3న ఎస్జీటీ, భాషాపండితులు, పీఈటీల బదిలీలు ఉంటాయి. వచ్చేనెల 5వ తేదీ నుంచి 19 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది.

పాయింట్లు ఇలా...

కేటగిరీలవారీగా ఉపాధ్యాయులకు పాయింట్లను కేటాయించారు. ఇందులో ఉపాధ్యాయ సంఘాల నేతలకు పాయింట్లను ఎత్తివేయడంతో వారు నిరాశకు గురవుతున్నారు. సీనియారిటీ ప్రకారం పాయింట్లను ఇచ్చారు.

ఒకేచోట 5 ఏళ్లకుపైగా ఉంటే నెలకు 0.416 పాయింట్లు, మూడేళ్లుంటే నెలకు 0.25, రెండేళ్లుంటే నెలకు 0.16, సంవత్సరం ఉంటే 0.083 పాయింట్లు ఇస్తారు. స్పెషల్ కేటగిరీలో ఉపాధ్యాయ సంఘాల నేతలకు గతంలో 10 పాయింట్లు ఉండేవి. వాటిని ప్రస్తుతం ఎత్తివేశారు.

వివాహం కాని మహిళలు, స్పౌజ్, రేషనలైజేషన్ కేటగిరీల వారికి 10 పాయింట్లు, దివ్యాంగులలో వైకల్య శాతాన్ని బట్టి మార్కులు ఇవ్వనున్నారు. వీటిపై ఇంకా స్పష్టత లేదు.

నేషనల్ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు 15, రాష్ట్ర అవార్డు పొందిన వారికి 10 పాయింట్లు ఇస్తారు.

ఎస్సెస్సీలో 100 శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేసిన వారికి 2.5 పాయింట్లు, 95శాతం వస్తే 2 పాయింట్లు, 90 శాతం సాధించిన వారికి ఒక పాయింట్ కేటాయిస్తారు. ప్రయారిటీ కేటగిరీలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి పాయింట్లు ఇస్తారు. ప్రమోషన్లు, బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామని డీఈవో రాజు తెలిపారు. ఆదివారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులు సహకరించాలి



జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చూస్తాం. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యాశాఖ ఆదేశాల మేరకు నెల రోజుల్లో ప్రక్రియను పూర్తి చేస్తాం. ఇందుకు ఉపాధ్యాయులు సహకరించాలి.

– ఎస్.రాజు, డీఈవో

పారదర్శకంగా నిర్వహించాలి



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను స్వాగతిస్తున్నాం. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి. గతంలో ఈ విషయంలో పలు ఆరోపణలు వచ్చాయి. ఈసారి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలి. అర్హులైన ఉపాధ్యాయులందరికీ న్యాయం జరిగేలా చూడాలి. – ప్రవీణ్ నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

'చలో గజ్వేల్' నిర్వహించి తీరుతాం

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- నియోజకవర్గ నేతలతో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశం

కామారెడ్డి టౌన్: చలో గజ్వేల్ కార్యక్రమాన్ని నిర్వహించి తీరుతామని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికలలో కామారెడ్డి నుంచి పోటీ చేయాలని భావిస్తున్న సీఎం కేసీఆర్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గ పరిస్థితిని ప్రజలకు చూపించేందుకు బీజేపీ కామారెడ్డి నియోజవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి శుక్రవారం నిర్వహించాల్సిన చలో గజ్వేల్ కార్యాక్రమాన్ని పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంపై శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డిలు కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు.



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ భద్రత మాదే.. బాధ్యత మాదే అని చెప్పే పోలీసులు వెంకటరమణారెడ్డి ఏం తప్పు చేస్తే అరెస్ట్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి చూడడానిని బస్సులు ఏర్పాటు చేస్తామని మహారాష్ట్రలో చెప్పిన కేసీఆర్.. కామారెడ్డి నుంచి గజ్వేల్ అభివృద్ధి చూడటానికి వస్తామంటే ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు. అవసరం అయితే బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చలో గజ్వేల్ చేపడతామన్నారు. మీడియా ప్రతినిధులు, పోలీసులు, ప్రజలు అందరూ ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. గజ్వేల్ కార్యక్రమాన్ని అడ్డుకున్నారంటే అక్కడ అభివృద్ధి లేదని అర్థం అయ్యిందన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తేలు శ్రీనివాస్, విపుల్, శ్రీకాంత్, లక్ష్మారెడ్డి, కాసర్ల శ్రీనివాస్, నరేందర్, సురేష్, పండ్ల ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి



కామారెడ్డి టౌన్: వినాయకచవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకులను పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్(హైదరాబాద్), నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహం మహా విగ్రహం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. హెచ్‌ఎం గంగా కిషన్, ఎన్‌జీసీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, పీసీబీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యం పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



కామారెడ్డి టౌన్: ఈ నెల 9న జిల్లాలోని కోర్టుల్లో నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, అధికారులు కోరారు. కార్యక్రమ నిర్వహణపై శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు సముదాయ భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నో రోజులు పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పరిష్కారం లభిస్తుందని వారు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం నాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టీ. రాజ్ గోపాల్ గౌడ్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు నంద రమేష్ , నిమ్మ దామోదర్ రెడ్డి, శేషు, తదితరులు పాల్గొన్నారు.

శెట్పల్లిలో అన్నాదమ్ముళ్ల మధ్య ఘర్షణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లి గ్రామానికి చెందిన నీల సత్యనారాయణ, బాలరాజు అనే అన్నాతమ్ముళ్లు తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో శనివారం ఘర్షణ పడినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వారసత్వంగా వచ్చిన ఆస్తులను సమానంగా పంచుకున్న వీరు తల్లిదండ్రులను ఒక్కొక్కరు ఆరు నెలలు పోషించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో అన్న బాలరాజు ఒప్పందాన్ని ఉల్లంగించారని ఇరువురు ఘర్షణ పడ్డారు. పాత కక్షలు మనసులో పెట్టుకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బొల్లక్‌పల్లి సర్పంచ్ భర్త మృతి

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి సర్పంచ్ సావిత్రి భర్త రవీందర్ (52) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని పాడే మోశారు. అంత్యక్రియల్లో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలీస్ సిబ్బంది



దోమకొండ: దోమకొండ పోలీస్‌స్టేషన్ సిబ్బంది మానవత్వం చాటారు. పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే హోంగార్డు దండు స్వామి కూమార్తె నిహారిక బధిరులు. పేద కుటుంబానికి చెందిన స్వామికి ఎస్సై మురళితో పాటు, తోటి పోలీస్ సిబ్బంది శనివారం రూ.25వేలు ఆర్థిక సహాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఎస్సై మురళి చేతుల మీదుగా నిహారిక వైద్య ఖర్చులకు హోంగార్డు స్వామికి నగదును అందజేశారు.

వైద్యశాఖలో దోపిడీ పర్వం

- సర్వీస్ సర్టిఫికెట్‌కు వెయ్యి రూపాయల చొప్పున వసూలు
- కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల నుంచి దోపిడీ
- అవినీతిమయంగా జిల్లా వైద్యారోగ్యశాఖ



డీఎంహెచ్‌వో కార్యాలయం, కామారెడ్డి

కామారెడ్డి టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖలో దోపిడీ పర్వం కొనసాగుతోంది. తాజాగా ఏఎన్ఎంల నుంచి రూ. వెయ్యి అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయనుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న వారికి వెయిటేజ్ మార్కులను వేయనుంది. దీనికి ఏఎన్‌ఎంలకు జిల్లా వైద్యారోగ్యశాఖ, డీఎంహెచ్‌వో నుంచి సర్వీస్ సాటిస్ఫ్యాక్టరి సర్టిఫికెట్ అవసరం. అయితే ఈ సర్టిఫికెట్ పొందేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్వీస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. ఇందుకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఒక్కో ఏఎన్‌ఎం నుంచి రూ. వెయ్యి బలవంతంగా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారని ఏఎన్‌ఎంలు వాపోతున్నారు. డబ్బులు ఇవ్వని వారికి సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

జిల్లాలో 300 మందికి పైగా కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సర్వీస్ సర్టిఫికెట్ జత చేస్తేనే వెయిటేజి మార్కులు వస్తాయి. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్వీస్ సర్టిఫికేట్ కోసం 200 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి నుంచి కార్యాలయంలోని ఓ ఉద్యోగితో పాటు డీఎంహెచ్‌వో స్వయంగా బలవంతంగా రూ. వెయ్యి వసూలు చేస్తున్నట్లు ఏఎన్‌ఎంలు వాపోతున్నారు. గతంలోనూ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల పోస్టుల భర్తీకి రూ. లక్షల్లో అక్రమంగా డబ్బులు వసూలు చేశారని తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మదన్‌మోహన్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాకు 10 వేల మంది నిరుద్యోగ యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ తెలిపారు. జాబ్ మేళాలో టాటా, రిలయన్స్, ముత్తూట్, అపోలో, మెడ్‌ప్లస్ ఫార్మసీ, వెక్ట్రోటిక్ సాఫ్ట్‌వేర్, భీమా జువెల్లర్స్‌తో పాటు మరో 30 మల్టీ నేషనల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయని, 2 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయని, వీరందరికి నియామక పత్రాలను అందించామని ట్రస్టు సభ్యులు భరత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మదన్‌మోహన్ ట్రస్టు సభ్యులు చెన్న లక్ష్మణ్, ఆరిఫ్, అజార్, వంశీ తదితరులున్నారు.

కరెంట్ కోతలను నిరసిస్తూ రైతుల ధర్నా



భిక్కనూరు: వానలు కురియక ఒక వైపు బాధపడుతుంటే మరో వైపు అప్రకటిత కరెంట్ కోతల వల్ల సాగు చేస్తున్న వరి పంట ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ భిక్కనూరు మండల భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రైతులు శనివారం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. శుక్రవారం మొత్తం ఏడు గంటల 15 నిమిషాలు మాత్రమే విద్యుత్ సరఫరా జరిగినట్లు రికార్డుల్లో చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వ్యవసాయరంగానికి నాణ్యమైన విద్యుత్‌ను 24 గంటలు అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకుతోందని, ఆచరణలో మాత్రం పొంతన లేదంటూ రైతులు సబ్‌స్టేషన్ ముందర ధర్నా నిర్వహించారు. వెంటనే నాణ్యమైన కరెంట్‌ను అందించాలని డిమాండ్ చేశారు.

ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలి



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

లింగంపేట(ఎల్లారెడ్డి): జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చేపడుతున్న ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. దీని కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజలకు ఓటు విలువను తెలియపర్చాలన్నారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీవో ప్రభాకరచారి, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను శనివారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు లిస్టులో మరణించిన వారి పేర్లను గుర్తించారా, గుర్తించినట్లయితే ఎంతమందిని గుర్తించారు, ఓటరులి స్టులో నమోదుకోసం కొత్తగా ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారు..తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఆయన వెంట తహసీల్దార్ సునీత, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్, ఆర్‌ఐ లక్ష్మణ్ తదితరులున్నారు.

ఐదారు గంటల కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదు



కామారెడ్డి రూరల్: వ్యవసాయానికి కరెంట్ సరఫరా సరిగా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నరసన్నపల్లి సబ్ స్టేషన్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. తమ పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని పాత రాజంపేట, నరసన్నపల్లి గ్రామాలకు చెందిన రైతులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ అందజేస్తున్నామని చెబుతున్నప్పటికీ స్థానికంగా మాత్రం అందుకు భిన్నంగా అధికారులు, సిబ్బంది కనీసం ఐదారు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. అధికారులను అడిగితే సింగిల్ ఫేజ్ కరెంటు ఇస్తున్నామని చెబుతున్నారని, సింగిల్ ఫేజ్ కరెంట్ ఇస్తే తమ పంటలకు నీళ్లు ఎలా పారుతాయని ప్రశ్నించారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేదంటే ఈ నెల 4న జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు.

ఒకే నెలలో 504 ప్రసవాలు

- బాన్సువాడ ఎంసీహెచ్‌లో రికార్డు

బాన్సువాడ: బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో అగస్టులో 504 ప్రసవాలు జరిగాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఆస్పత్రిలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ప్రారంభించి రెండేళ్లవుతోందన్నారు. గత నెలలో రికార్డు స్థాయిలో 504 ప్రసవాలు జరిగాయన్నారు. వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. వైద్యులు సుధ, సిబ్బంది ఉన్నారు.



మాతా శిశు ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు , ఇతర సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

భిక్కనూరు: జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామశివారులోని రైస్ మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో కామారెడ్డి వైపు వెళ్తున్న లారీని హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో వెనుక నుంచి ఢీకొన్న లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

క్రైం కార్నర్

ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్య



గజ్జెల రాకేష్ (ఫైల్)

రాజంపేట: ఆర్మీలో చేరాలన్న కల నెరవేరడం లేదని, ఉద్యోగం రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రానికి చెందిన గజ్జెల రాకేష్(24) ఐటీఐ పూర్తి చేశాడు. సైన్యం చేరాలన్నది అతడి కల. రెండుసార్లు ఆర్మీ సెలక్షన్స్‌కు హాజరైనా.. కంటి చూపు సమస్యతో ఉద్యోగానికి ఎంపిక కాలేకపోయాడు. ఉద్యోగావకాశాలు రాకపోవడంతో మానసికంగా కుంగిపోయిన రాకేష్.. శనివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి,తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా.. చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి గజ్జెల లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఏఎస్సై గంగారెడ్డి తెలిపారు.

వివాహిత అదృశ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బాడ్సి గ్రామానికి చెందిన పిల్లిగంప సంధ్య అదృశ్యమైనట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. సంధ్యకు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో రెండు నెలల క్రితం వివాహమైంది. ఆగస్టు 4న తల్లిగారింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సంధ్య తిరిగి రాలేదు. అప్పటి నుంచి బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. సంధ్య తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



రాజేందర్ (ఫైల్)

సిరికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రావుట్ల గ్రామానికి చెందిన నడుకుడ రాజేందర్(45) శనివారం మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మెల్యేను కలవడానికి రావుట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు గత నెల 22న హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా చేగుంట వద్ద వీరిని కోళ్ల వ్యాను ఢీకొన్నది. ఈ ఘటనలో కారులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవింగ్ చేస్తున్న రాజేందర్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా



డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండా వద్ద ఆర్మూర్ నుంచి కామారెడ్డి వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో కారులోని బెలూన్ ఓపెన్ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదు. స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తలరించారు.

బాన్సువాడ బస్టాండ్‌లో చోరీ

బాన్సువాడ: బాన్సువాడ బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగులో ఉన్న 5.8 తులాల బంగారాన్ని దుండగులు చోరీకి పాల్పడ్డారు. నిజామాబాద్‌కు చెందిన గోదావరి తన సోదరుడి ఇంట్లో శుభకార్యనిమిత్తం బిచ్కుందకు వెళ్తుండగా బాన్సువాడలో దిగింది. బాన్సువాడలో బిచ్కుంద వెళ్లేందుకు దెగ్లూర్ బస్సు ఎక్కగా బ్యాగులో ఉన్న బంగారం చోరీకి గురైనట్లు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

పశువుల కొట్టం దగ్ధం

మాచారెడ్డి: అక్కాపూర్ గ్రామంలోని రమేశ్‌కు చెందిన పశువుల కొట్టంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఓ గేదె సజీవ దహనం కాగా మరో గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గేదెతో పాటు వరిగడ్డి దగ్ధం కావడంతో రు 1.30లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

పేదల కోసమే కల్యాణ మండపాల నిర్మాణం

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి
- ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.37.50 కోట్లు మంజూరు
- బాన్సువాడలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



బాన్సువాడలో కుర్మ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ : పేదల కోసమే కల్యాణ మండపాల నిర్మాణం చేపడుతున్నామని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పాత బాన్సువాడలో పలు అభివృద్ధి పనులను స్పీకర్ ప్రారంభించి మాట్లాడారు. జనాభాలో 80 శాతం పేదవారే ఉంటారని, వారి ఇళ్లలో పెళ్లిళ్లు చేయాలంటే రూ.లక్షలు ఖర్చు చేసి కల్యాణ మండపాల్లో చేయలేరని అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వం తరపున 112 కల్యాణ మండపాలను నిర్మించామని తెలిపారు. పేదవారికి పెళ్లిళ్ల భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఒక్క బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోనే 2,660 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించామని తెలిపారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం ఇళ్లకు రూ.600 కోట్లు మంజూరైతే ఇప్పటి వరకు రూ.450 కోట్ల బిల్లులు లబ్ధిదారులకు అందజేశామని అన్నారు. బాన్సువాడ ఏరియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణానికి రూ.37.50 కోట్లు మంజూరయ్యాయని, హనుమాన్ ఆలయం నుంచి చైతన్య కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజురు అయ్యాయని వివరించారు. రైతులు సూచించిన విధంగా లిఫ్ట్ రోడ్డు నుంచి చింతల్‌నాగారం చెక్ డ్యాం వరకు, హరిజవాడ శ్రీనివాస కళ్యాణ మండపం నుంచి దాసరి శ్రీనివాస్ పొలం వరకు సీసీ రోడ్డు నిర్మాణం నిధుల కోసం ప్రతిపాదనలు పంపామని త్వరలో నిధులు మంజూరవుతాయని అన్నారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఆర్డీవో భుజంగరావు, హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు ఎజాస్, వెంకట్‌రాంరెడ్డి, శ్రీధర్, తదితరులున్నారు.

ఏఎంసీ ఆవరణలో అద్దెకు 20 దుకాణాలు

వేలం పాటకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి క్రైం/పిట్లం: పిట్లం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతనంగా నిర్మించిన 20 దుకాణ సముదాయాలను అద్దెకు ఇవ్వడానికి ఆన్‌లైన్ ద్వారా బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీలకు 3, ఎస్టీకి ఒకటి, బీసీలకు 5, దివ్యాంగులకు ఒక దుకాణం, జనరల్ కేటగిరీ కింద 10 దుకాణాలు కేటాయించినట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం పనివేళల్లో రూ.500 చెల్లించి దరఖాస్తు ఫారం పొందాలని సూచించారు. దరఖాస్తుతో పాటు కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, పిట్లం పేరు మీద రూ.15 వేల డీడీని ఏదైనా జాతీయ బ్యాంక్ నుంచి తీసి జతపర్చాలన్నారు. ఏదైనా గుర్తింపు కార్డును కూడా జతపర్చాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 11 న సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 7330733249 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నియోజకవర్గ నేతలతో కిషన్‌రెడ్డి, ఈటల సమావేశం

- వెంకటరమణారెడ్డికి అభినందనలు



బీజేపీ పెద్దలతో నియోజకవర్గ బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ సీనియర్ నాయకులు ఇంద్రసేనారెడ్డిలతో కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ రాజకీయాలు, భవిష్యత్తు కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. కామారెడ్డిలో రాజకీయ పరిస్థితులపై నేతలు ఆరా తీసారు. బీజేపీ గెలుపు కోసం కార్యచరణపై చర్చించారు. పూర్తి వివరాలను కామారెడ్డి నియోజకవర్గ ఇంఛార్జి కాటిపల్లి వెంకట రమణా రెడ్డి వారికి వివరించారు. ఆయన్ని కిషన్‌రెడ్డి, ఈటేల, ఇంద్రసేనారెడ్డిలు అభినందించారు. గత మూడేళ్లుగా మాస్టర్‌ప్లాన్, డ్వాక్రా మహిళా సంఘాల రుణాలు, ప్రజా దర్బార్, చలో గజ్వేల్ కార్యక్రమాల విజయంతో నియోజవర్గంలో బీజేపీ ప్రజల్లోకి వెళ్లిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కామారెడ్డిలో బీజేపీ గెలుపు ఖాయమని వారు అన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



గోవర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం, ఉప్పల్‌వాయి పాఠశాల



తమ్మల రాజు, ఎస్‌ఏ, తుజాల్‌పూర్ పాఠశాల

సాక్షి, కామారెడ్డి: జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారిని సత్కరిస్తోంది. ఈసారి కూడా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. మొదటి కేటగిరీలో రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్మాస్టర్ పాపయ్యగారి గోవర్ధన్‌రెడ్డి, రెండో కేటగిరిలో బీబీపేట మండలం తుజాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తమ్మల రాజు ఎంపికయ్యారు. 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర రాజధానిలో నిర్వహించే కార్యక్రమంలో వీరు అవార్డులను అందుకోనున్నారు. అవార్డుకు ఎంపికైన ఉప్పల్‌వాయి ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ గోవర్ధన్‌రెడ్డి గ్రామస్తుల సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దారు. పాఠశాలలో కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రయత్నించారు. తుజాల్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తమ్మల రాజు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తారన్న పేరుంది. విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి కల్పించడానికి ఆయన ప్రయత్నిస్తారు. జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి అవార్డులు రావడంపై పలువురు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మా కంపెనీ ఎదుట ఆత్మహత్యాయత్నం

- బిల్లులు ఇవ్వడం లేదంటూ వార్డు సభ్యుడి ఆవేదన



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న జ్యోతి



మెడ కోసుకునేందుకు యత్నిస్తున్న శివరాజు

భిక్కనూరు: బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఓ ఫార్మ కంపెనీ ఎదుట వార్డు సభ్యుడు తన భార్యతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని జంగంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జంగంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, వార్డు సభ్యుడు చెట్కూరి శివరాజు గ్రామ శివారులోని ఓ ఫార్మ కంపెనీతో ఒప్పంద ప్రకారం 2022లో మూడు బస్సులను అద్దెకు ఇచ్చాడు. కానీ యాజమాన్యం బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తూ వస్తోంది. దీంతో ఫైనాన్స్ వారు ఇటీవల సరిగా ఈఎంఐలు చెల్లించడం లేదంటూ బస్సులను సీజ్ చేశారు. బిల్లులను చెల్లించాలంటూ శివరాజు, భార్య జ్యోతితో కలిసి ఫార్మ కంపెనీ ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసుల ఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఇరువురితో చర్చిస్తుండగానే శివరాజు కొడవలితో, జ్యోతి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన పోలీసులు, సిబ్బంది వారిని అడ్డుకున్నారు.

భార్యా కుమారులే హంతకులు

- పొలం దక్కకుండా చేస్తారనే కోపంతో ఘాతుకం
- హత్య కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ జయేశ్‌రెడ్డి

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఉప్పుల ఆజయ్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో భార్య, ఇద్దరు కుమారులే అసలైన నిందితులను వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జయేశ్‌రెడ్డి శనివారం తెలిపారు. కోటగిరి పీఏస్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఆజయ్య దురలవాట్లకు బానిసై ఉన్న పది గుంటల పొలాన్ని తమకు దక్కకుండా చేస్తున్నాడనే కోపంతో బ్రిడ్జి హత్య చేసినట్లు తెలిపారు. కోటగిరి ఎస్సై సందీప్, ఏఎస్సై బాల్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.